క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చుండూరు(వేమూరు): చుండూరు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని చుండూరు, మున్నంగి వారిపాలెంలో విద్యుత్ లైన్‌ల మరమ్మతుల నిమిత్తం మంగళవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అసిస్టెంట్ ఇంజినీరు దోనేపూడి అర్జునరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు గమనించాలని తెలిపారు.

భట్టిప్రోలులో...

భట్టిప్రోలు: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిలుపుదల చేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ పి.ఏడుకొండలు సోమవారం ప్రకటనలో తెలిపారు. పల్లెకోన నుంచి నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్‌ను భట్టిప్రోలు సబ్ స్టేషన్‌కు కలుపుతున్న నేపథ్యంలో సరఫరాకు విఘాతం కలగనున్నట్లు పేర్కొన్నారు. భట్టిప్రోలు, వెల్లటూరు, వేమవరం, సూరేపల్లి, కోనేటిపురం, ఆళ్ళమూడి, ఐలవరం, పల్లెకోన ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

రేపల్లెలో...

రేపల్లె రూరల్: విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు రేపల్లె పట్టణం మొత్తం, మండలంలోని పేటేరు, మోర్తోట విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఆ శాఖ పట్టణ ఏఈ ఏడుకొండలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

చుండూరులో..

చుండూరు(భట్టిప్రోలు): చుండూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని చుండూరు, మున్నంగి వారిపాలెం గ్రామాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిలుపుదల చేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ అర్జునరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు పల్లెకోనలో వైద్య శిబిరం

భట్టిప్రోలు: మండలంలోని పల్లెకోనలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జేవీబీ మల్లికార్జునరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు పీహెచ్‌సీల నుంచి వైద్యులు, ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ హాస్పిటల్ నుంచి ఇద్దరు స్పెషలిస్టులు, కంటి వైద్య నిపుణులు పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందిస్తారని తెలిపారు.

నేడు రైల్వేగేటు మూసివేత

వేమూరు: రైల్వే స్టేషన్ సమీపంలోని 263 నెంబరు గేటు మరమ్మతుల నిమిత్తం మూసివేస్తున్నట్లు రైల్వే సెక్షన్ ఇంజినీరు చంద్రశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం సాయంత్రం 7 నుంచి తెల్లవారుజాము వరకు గేటు మూసి వేయడం జరుగుతుందని పేర్కొన్నారు. 20, 21 తేదీల్లో సాయంత్రం గేటు మరమ్మతులు చేస్తారని తెలిపారు. తెనాలి నుంచి రేపల్లె వెళ్లే వాహనాలు రాకపోకలు నిలిపివేస్తారని ఆయన పేర్కొన్నారు. ప్రయాణికులు గమనించాలని తెలిపారు.

నేడు 'వలంటీర్లకు వందనం'

రేపల్లె రూరల్: పట్టణంలోని పత్తిపాటి సీతారామయోగిని కల్యాణ మండపంలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్, బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వలంటీర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని తెలిపారు.

'స్పందన'కు ఏడు అర్జీలు

రేపల్లె రూరల్: ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అందించి పరిష్కరించుకునేందుకు స్పందన కార్యక్రమం చక్కని వేదిక అని ఆర్డీవో కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ అధికారి జాన్‌పీటర్ అన్నారు. స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. రేపల్లె మున్సిపాలిటీలో 1953 సంవత్సరం తర్వాత జరిగిన తమ భూమికి సంబంధించిన రిజిస్ట్రేషన్ దస్తావేజుల మంజూరుకు ఒకరు దరఖాస్తు అందించారన్నారు. లేనటువంటి రైస్‌మిల్‌కు సంబంధించిన డిమాండ్ నోటీసు రద్దుచేయాలని, నివేశన స్థలానికి పొజిషన్ సర్టిఫికెట్, రైతు భరోసా మంజూరుకు, పొలంలో వేసిన డ్రెయినేజీ తొలగింపునకు అర్జీలు అందాయని తెలిపారు. లంక ల్యాండ్ పట్టా మంజూరుకు కొల్లూరు మండలం గాజులంక నుంచి అర్జీ అందగా, పొలం ఆన్‌లైన్ చేయాలని కోరుతూ నిజాంపట్నం మండలం కూచినపూడి గ్రామం నుంచి ఒక అర్జీ అందిందన్నారు. సమస్యలను పరిశీలించి, పరిష్కరించనున్నట్లు ఏఓ తెలిపారు.

నేడు ఆన్‌లైన్ సమావేశం

కూచిపూడి(వేమూరు): అమర్తలూరు మండలం కూచిపూడి గ్రామంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10 గంటలకు టెలికాల్స్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న నియోజకవర్గ సోషల్ మీడియా మిత్రులు పాల్గొనాలని తెలిపారు.

టార్గెట్ 100%

విద్యార్థి జీవితంలో పదో తరగతి ఎంతో కీలకం. పబ్లిక్ పరీక్షల్లో సాధించే మార్కులే ఉన్నత విద్యకు తొలిమెట్టు. దీన్ని దృష్టిలో పెట్టుకొని నూరు శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా విద్యాశాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. పరీక్షల సన్నద్ధతకు ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలల్లో స్టడీ అవర్స్ ఏర్పాటు చేసి విద్యార్థులను ప్రణాళిక బద్ధంగా చదివిస్తున్నారు.

- పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- రివిజన్ టెస్టులతో పబ్లిక్ పరీక్షలపై పట్టు
- నూరు శాతం ఉత్తీర్ణత లక్ష్యం


స్టడీ హవర్స్‌లో పదో తరగతి విద్యార్థులు

బాపట్ల అర్బన్: మార్చి 18 నుంచి 30వ తేదీ వరకు పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి. గతంలో ఉన్న 11 ప్రశ్న పత్రాలను గతేడాది నుంచి ఆరు పేపర్లకు కుదించారు. పరీక్ష 3.15 గంటలు, ఒక్కో పేపర్ వంద మార్కులు ఉంటుంది. పాఠశాలలో ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సాయంత్రం నాలుగు నుంచి ఐదున్నర గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. బాపట్ల జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు, జెడ్పీ ఉన్నత పాఠశాలల నుంచి ఈ ఏడాది మొత్తం 19,179 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్నారు. పరీక్ష సమయంలో విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా మంచి మార్కులు సాధించేలా ముందస్తుగా మాక్ టెస్ట్ నిర్వహిస్తున్నారు. చదువులో వెనకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. అన్ని సబ్జెక్టుల బోధనను ఉపాధ్యాయులు పూర్తిచేశారు. జనవరి నుంచి రోజుకో సబ్జెక్టు చొప్పున రివిజన్ టెస్ట్‌లు పూర్తిచేశారు. ప్రతి సబ్జెక్ట్ నుంచి రోజుకొక పాఠ్యాంశాన్ని రివిజన్ చేయించడం ద్వారా మొత్తం పాఠ్యాంశాల పునఃశ్చరణ అవుతోంది.

ప్రతిరోజూ రివిజన్ టెస్ట్‌లు



ప్రత్యేక తరగతుల్లో రివిజన్ టెస్టులు పెడుతున్నారు. మరుసటి రోజు తప్పులను సరిచేయిస్తున్నారు. ఇది పబ్లిక్ పరీక్షలకు ఎంతో సహాయపడుతుంది. బాగా చదువుతున్నాను.

– కె.యునిక, విద్యార్థిని, గురుకుల పాఠశాల, బాపట్ల.

ప్రత్యేక తరగతులతో మేలు



ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు మార్కులు సాధనకు ఉపయోగపడతాయి. పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని పట్టుదలతో చదువుతున్నాను. ఇంగ్లీష్, మాథ్స్, సైన్స్ పాఠ్యాంశాలను శ్రద్ధంగా బోధిస్తున్నారు.

– గ్రేస్ లైఫ్, విద్యార్థిని, గురుకుల పాఠశాల, బాపట్ల.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



సమ్మేటివ్ పరీక్షలు పూర్తి కావడంతో చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం. విద్యార్థులు పరీక్షల ఒత్తిడిలో పొరపాట్లు చేస్తారు. సులభ పద్ధతిలో మంచి మార్కులు ఎలా పొందాలో ప్రత్యేక తరగతుల్లో బోధిస్తున్నాం.

– కమ్మ భవానిదేవి, ప్రిన్సిపల్, గురుకుల పాఠశాల, బాపట్ల.

పర్యవేక్షిస్తున్నాం



జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దారు, ఎంపీడీఓ, ఎంఈఓలతో కలిసి పాఠశాలల్లో విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పర్యవేక్షిస్తున్నాం. డీసీఈబీ ఇచ్చిన 60 రోజులు కార్యాచరణను అమలు చేస్తున్నాం. నూరు శాతం ఉత్తీర్ణత సాధనకు కృషి చేస్తున్నాం.

– కె.నారాయణరావు, డీఈఓ, బాపట్ల.

కనుల పండువగా మహాకుంభాభిషేకం


ఆలయ శిఖరంపై కలశాలకు కుంభాభిషేకం


ప్రతిష్ఠాంగ హోమంలో పరమహంస సచ్చిదానంద సరస్వతి


కొల్లూరు : మహాకుంభాభిషేక మహోత్సవాలు కనులపండుగగా జరిగాయి. సోమవారం కొల్లూరులోని పార్వతీ సమేత అనంతభోగేశ్వరాలయంలో తుని తపోవన శ్రీమఠాధిపతులు శ్రీపరమహంస సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి చేతుల మీదుగా గాలిగోపురంపై ప్రతిష్ఠించిన నూతన కలశాలకు శాస్త్రోక్తంగా వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ మహాకుంభాభిషేక మహోత్సవ జరిగింది. కొల్లూరు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి భక్తిశ్రద్ధలతో వేడుకలు తిలకించారు. తొలుత ఆలయ ప్రాంగణంలో మండప పూజలు, హోమాలు, మహాపూర్ణాహుతి బలి ప్రదానం, కలశోద్వాసన నిర్వహించారు. మహాకుంభాభిషేకం అనంతరం పార్వతీ సమేత అనంతభోగేశ్వర స్వామి కల్యాణం, మహా మంగళ హారతి, మంత్ర పుష్పం, తీర్థప్రసాద వినియోగం, ఋత్విక్ సన్మానం, మహాదాశీర్వచన కార్యక్రమాలు జరిపారు. భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. అన్న సంతర్పణ చేశారు. ఆలయ ఈఓ మంతెన అనుపమ, పాలకవర్గ చైర్మన్ యడ్ల పెదబాబు, సభ్యులు పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమాలకు భాగవతుల సూర్యనారాయణమూర్తి, భాగవతుల ఆనందమోహన్, బాగవతుల శ్రీనివాస్, కల్లూరి వెంకట సూర్యనారాయణ మూర్తిలతోపాటు గ్రామస్తులు సహాయ, సహకారాలు అందజేశారు. మహాకుంభాభిషేక మహోత్సవాన్ని పురస్కరించుకుని వేమూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు, ఆయన సతీమణి లక్ష్మీ అనంతభోగేశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సూర్యదేవర రామకృష్ణ, గాజుల్లంక సర్పంచ్ సనక వెంకట్రావు, ఎంపీటీసీ సభ్యురాలు గరిక నీలిమ, నాయకులు కమ్మెల సాంబయ్య, ఉప్పు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

భద్రావతి అమ్మవారికి సారె సమర్పణ




రేపల్లె రూరల్: పట్టణంలోని ఓల్డ్ టౌన్‌లో ఉన్న భద్రావతి సమేత భావనారుషి స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న కల్యాణ మహోత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు అమ్మవారికి పుష్పాలు, పండ్లు, మిఠాయిలు, నూతన వస్త్రాలతో కూడిన సారెను ఊరేగింపుగా ఆలయానికి తీసుకెళ్లారు. అర్చకులు అమ్మవారికి, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదలు అందజేశారు.

వైభవంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



రేపల్లె రూరల్: పట్టణంలోని అంబేడ్కర్ పార్కు సమీపంలో ఉన్న సాయినాథుని ఆలయ వార్షికోత్సవాలు సోమవారం వైభవంగా నిర్వహించారు. సుప్రభాత సేవ, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. బాబాను పట్టు వస్త్రాలతో అలంకరించారు. ప్రత్యేక పూజలు చేసి, హారతులు పట్టారు. భక్తులు అధిక సంఖ్యలో బాబాను దర్శించుకున్నారు. మహిళా భక్తులు ఆలయ ఆవరణంలో సాయి చాలీసా పఠించారు. అర్చకులు బాబా జీవిత చరిత్రను భక్తులకు వివరించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేసి, అన్న సంతర్పణ చేశారు.

సాయి నామంతో మార్మోగిన బాపట్ల





బాపట్ల అర్బన్: బాపట్ల కొత్త బస్టాండ్ వద్ద జీబీసీ రోడ్డులోని షిర్డి సాయిబాబా దేవాలయంలో 28వ ప్రతిష్ఠ వార్షికోత్సవం సోమవారం నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి కాగడ హారతి, పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. విశేష అలంకరణ అనంతరం గురుపాదుక పూజా కార్యక్రమం, మధ్యాహ్నం హారతి ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్నసంతర్పణ చేశారు. బాబా ఊరేగింపు వేడుకగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ కమిటీ అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, కమిటీ సభ్యులు, అర్చక స్వాములు కర్ల పాలెం మోహన రత్న సాయి, పమిడిగటం సాయి కిరణ్ పాల్గొన్నారు.

విశ్వేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠోత్సవం

వేమూరు: మండలంలోని అబ్బనగూడవల్లి గ్రామంలో గంగా అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి నూతన ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు పాల్గొని, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆలయ కమిటీ సభ్యులను అభినందించారు. భక్తులకు అన్నసంతర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కొండిశెట్టి నరసింహారావు, బొందలపాటి వెంకయ్య, లావు బోసు, భూపతి రమేష్, వి.దాసా శంకరరావు, కొండిశెట్టి రాంబాబు, బొందలపాటి విశ్వేశ్వరి పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీధర్


మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీసీత

తెనాలిరూరల్: జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.శ్రీధర్ సూచించారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మార్చి 9న లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో తెనాలి కోర్టుల ప్రాంగణంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి శ్రీధర్ మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు రాజీ అవడంతో కక్షిదారులకు ఆర్థిక పరంగానూ వెసులుబాటు కలుగుతుందని, కోర్టుల్లో ఉన్న కేసులనూ రాజీ చేసుకోవచ్చని తెలిపారు. కేసుల లిటిగేషన్ విపరీతంగా పెరగడం వల్ల వాటిని పరిష్కరించే దిశలో లోక్ అదాలత్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సివిల్ కేసులు ఏ దశలో ఉన్నా పరిష్కరించుకోవచ్చని చెప్పారు. రాజీ కాదగిన సివిల్, క్రిమినల్, ప్రీ–లిటిగేషన్, వాహనాలు, బ్యాంకులు, బీఎస్ఎన్ఎల్ కేసులు పరిష్కరించుకోవచ్చన్నారు. సదస్సులో అదనపు సీనియర్ సివిల్ జడ్జి షేక్ అబ్దుల్ షరీఫ్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రాజశేఖర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మందలపు వేణుగోపాలరావు, మండల న్యాయసేవాధికార సంస్థ పర్యవేక్షకుడు షేక్ మహబూబ్, పీఎల్‌వీ యర్రంశెట్టి అనిల్‌కుమార్, కక్షిదారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి అవగాహన

మార్చి 9న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె. శ్రీసీత పోలీసులకు సూచించారు. పోలీసు అధికారులతో తన చాంబరులో సోమవారం ఆమె సమావేశమయ్యారు. రాజీ అయ్యే కేసులన్నిటిని అదాలత్‌లో పరిష్కరించుకునేలా కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు. అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా చొరవ చూపాలని కోరారు. తెనాలి సబ్ డివిజన్, వేమూరు, రేపల్లె సర్కిల్ పోలీసులు పాల్గొన్నారు.

వసతి గృహాల తనిఖీ


హాస్టల్ గదిలో తనిఖీ చేస్తున్న డీఎస్పీ వెంకటేశులు

బాపట్లటౌన్: విద్యార్థులు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ టి. వెంకటేశులు హెచ్చరించారు. బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలోని వసతి గృహాలను సోమవారం తెల్లవారు జామున డీఎస్పీ ఆధ్వర్యంలో 60 మంది పోలీసులు ఏక కాలంలో తనిఖీ చేశారు. ప్రతి గదికి వెళ్లి.. క్షుణ్ణంగా పరిశీలించారు. డీఎస్పీ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే చదువుతోపాటు క్రమశిక్షణ నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

పెన్నులు, ప్యాడ్‌ల పంపిణీ

రేపల్లెరూరల్: రోటరీ క్లబ్ ఆఫ్ రేపల్లె ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని శ్రీరామకృష్ణ విద్యా నిలయంలో 50 మంది విద్యార్థులకు క్లబ్ గవర్నర్ బూసిరెడ్డి శంకర్‌రెడ్డి పెన్నులు, ప్యాడ్‌లు పంపిణీ చేశారు. పలు వసతి గృహాలకు ఐదు ఫ్యాన్‌లు అందజేశారు. అసిస్టెంట్ గవర్నర్ కె.మురళీకృష్ణ, క్లబ్ అధ్యక్షుడు సక్సేనా, కార్యదర్శి పాములూరి శివశంకరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ నగదు చెక్కు అందజేత


నగదు చెక్కు అందజేస్తున్న ఎంపీ మోపిదేవి, సమన్వయకర్త గణేష్

రేపల్లె రూరల్: ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో ఉపయోగపడుతుందని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. నిజాంపట్నం మండలం దిండి పంచాయతీకి చెందిన నర్రా గోపీకృష్ణ ఇటీవల కిడ్నీ మార్పిడి చేయించుకున్నారు. అతని వైద్యానికి మంజూరైన రూ.5లక్షల నగదు చెక్కును మోపిదేవి తన క్యాంప్ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్‌తో కలిసి సోమవారం అందజేశారు. బావుడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు పాల్గొన్నారు. అదే విధంగా చెన్నుపల్లివారిపాలెం గ్రామస్తుడు చెన్నుపల్లి వెంకటేశ్వరరావు అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఎంపీ మోపిదేవి అతని ఇంటికి వెళ్లి పరామర్శించారు. రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రూరల్ కన్వీనర్ గాదె వెంకయ్యబాబు, నాయకులు దూళిపాళ్ల పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలులో నిర్లక్ష్యం తగదు

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త అశోక్‌బాబు


సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న సమన్వయకర్త అశోక్‌బాబు

చుండూరు(వేమూరు): సంక్షేమ పథకాల అమలులో నిర్లక్ష్యం వహించరాదని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు అన్నారు. చుండూరు మండలంలోని మండూరు గ్రామ సచివాలయాన్ని సోమవారం ఆయన సందర్శించారు. సచివాలయ సిబ్బందితో మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు తీరును వలంటీర్లతో చర్చించాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కులాలకు, మతాలకు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించారని చెప్పారు. రెడ్డి రాజేంద్ర, లంక శ్రీనివాసరావు, మోదుకూరి హరిబాబు, సురేంద్ర, బర్మా ప్రవీణ్, సీహెచ్ వీరాంజనేయులు, జోషి కాంత్, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

గోవాడ తిరునాళ్ల సజావుగా జరిగేలా చర్యలు

మౌలిక వసతుల కల్పన, నిర్వహణపై ఆర్డీఓ సమీక్ష


తిరునాళ్ల ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న ఆర్డీవో హెలా షారోన్

రేపల్లె రూరల్: గోవాడ తిరునాళ్లకు వచ్చే భక్తులకు ఎలాంటి లోటులేకుండా మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అధికారులు శక్తివంచన లేకుండా పనిచేయాలని ఆర్డీఓ హెలా షారోన్ ఆదేశించారు. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మార్చి 8న గోవాడ బాలకోటేశ్వరస్వామి తిరునాళ్ల నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి ఆలయ పరిధిలోని అధికారులతో సోమవారం తన కార్యాలయంలో ఆర్డీఓ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆలయంలో బారిగేట్లు ఏర్పాటు చేయాలన్నారు. స్వామివారి దర్శనానికి క్యూలైన్‌లో వెళ్లే భక్తులకు మధ్యలో తాగునీటి సౌకర్యం కల్పించాలని సూచించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలతో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రత్యేక పార్కింగ్ ప్రదేశాలను ఎంపిక చేయాలన్నారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసే వివిధ స్టాళ్లకు విధిగా అనుమతులు తీసుకోవాలన్నారు. ఆలయ ప్రాంతంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా విద్యుత్ శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. పోలీసు అధికారులు ప్రత్యేక నిఘా ఉంచాలని చెప్పారు. మండల ప్రజా పరిషత్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్యం లోపించకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వైద్యులు, పశు వైద్యులు అందుబాటులో ఉండి తమ సేవలు అందించాలని ఆర్డీఓ దిశానిర్దేశం చేశారు. పలు అంశాలపై అధికారులో చర్చించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ తక్కెళ్లపాటి మురళీకృష్ణ, డీఎల్‌పీఓ తాతా శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ సేవలు మరువరానివి


ట్రై సైకిల్ అందజేస్తున్న క్లబ్ గవర్నర్ శంకర్‌రెడ్డి

తెనాలి అర్బన్: రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం సేవలు మరువరానివని క్లబ్ జిల్లా గవర్నర్ బూసిరెడ్డి శంకర్‌రెడ్డి పేర్కొన్నారు. క్లబ్ ఆధ్వర్యంలో గంగానమ్మపేటలోని సంస్థ కార్యాలయంలో సోమవారం ముగ్గురు దివ్యాంగులకు ట్రైసైకిల్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లబ్ అనేక సేవ కార్యక్రమాలు చేస్తోందని చెప్పారు. క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ కన్నెగంటి మురళీ, అధ్యక్షుడు పావులూరి రాంబాబు, కార్యదర్శి నల్లూరి వెంకటేశ్వరరావు, ట్రెజరర్ కేఎల్.జగదీశ్వరాంబ, సభ్యులు ఈదర వెంకట పూర్ణచంద్, గుప్తా వెంకటరత్నం, ఈదర శ్రీనివాసరావు, బత్తుల వెంకటేశ్వరరావు, కొఠారి చేతన్ తదితరులు పాల్గొన్నారు.

సినీ రచయిత కోన వెంకట్ జన్మదిన వేడుకలు


సీతారామిరెడ్డికి కేక్ తినిపిస్తున్న ఏడుకొండలు

కర్లపాలెం: ప్రముఖ సినీ రచయిత, నిర్మాత, వైఎస్సార్ సీపీ నాయకుడు కోన వెంకట్ జన్మదిన వేడుకలు సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ మండలాధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు కేక్ కట్‌చేసి ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డికి, ఎంపీపీ యారం వనజకు తినిపించారు. సమాజానికి మంచి సందేశాన్నందించే ఎన్నో చిత్రాలను రచించిన ఘనత కోన వెంకట్‌కు దక్కుతుందన్నారు. వైస్ ఎంపీపీలు పందరబోయిన సుబ్బారావు, కాగిత బుల్లియ్య, పార్టీ నాయకులు పరమానందకుమార్, నాగేశ్వరరెడ్డి, అక్కల శ్రీనివాసరెడ్డి, బెనర్జి తదితరులున్నారు.

బుద్ధిస్ట్ క్యాలెండర్ ఆవిష్కరణ

భట్టిప్రోలు: సద్ధమ్మ దీపిక చారిటబుల్ ట్రస్ట్ అమరావతి బౌద్ధ విహార్ (ఘంటసాల)కు చెందిన బౌద్ధ భిక్షువు బంతె దమ్మ దజీ సోమవారం భట్టిప్రోలు బౌద్ధస్థూపాన్ని సందర్శించారు. సద్ధమ్మ ఉపాస్త(బుద్ధిస్ట్) క్యాలెండర్–2024ను ఆయన ఆవిష్కరించారు. బౌద్ధ భిక్షువు దమ్మ దజీ మాట్లాడుతూ.. ప్రతి రోజూ ఒకరికి ఒక రూపాయి దానం చేయాలని, అలా కుదరని పక్షంలో గుప్పెడు అన్నం కాకులకు పెట్టాలన్నారు. అదీ కుదరకపోతే గుప్పెడు పంచదార చీమలకు పెట్టినట్లయితే వాటి ఆకలిని తీర్చినవారమవుతామని పేర్కొన్నారు. ప్రతి రోజూ దానం చేయడం వల్ల సర్వ పాపాలు తొలగిపోతాయని పేర్కొన్నారు. క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో జడా రవీంద్రబాబు, శ్యామ్, సముద్రాల నాని, రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఏఎన్‌యూలో జాతీయ సదస్సు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ సెంటర్ ఫర్ డాక్టర్ అంబేడ్కర్ చైర్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించే జాతీయ సదస్సు మంగళవారం నిర్వహించనున్నట్లు సదస్సు డైరెక్టర్, అంబేడ్కర్ చైర్ విభాగాధిపతి ఆచార్య వై.అశోక్ కుమార్ తెలిపారు. 'డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఆలోచన విధానం ఆర్థిక అభివృద్ధి దేశ నిర్మాణం' అనే అంశంపై సదస్సు నిర్వహించనున్నట్లు చెప్పారు. సదస్సుకు ముఖ్య అతిథిగా ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి.రాజశేఖర్ హాజరవుతారని, సఫాయి కర్మచారి ఆందోళన్ కన్వీనర్ బెజవాడ విల్సన్ కీలకోపన్యాసం చేస్తారని తెలిపారు. గౌరవ అతిథులుగా రెక్టార్ ఆచార్య పి.వరప్రసాద మూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సీహెచ్ స్వరూపరాణి హాజరవుతారని తెలిపారు.